
# విఠలా! విఠలా!! పాండురంగ విఠలా!!!

విఠల్‌రావు అచ్చంగా కవి పండిత వంశంలో పుట్టినవాడు. నిజమే! అతని పూర్వీకులు చాలా మంది గొప్ప పండితులు, కవులు, విఠల్ రావు తరచూ అందరితోనూ ఈ సంగతే చెప్తుంటాడు. అతనీ మాటలు ఆఫీసులోనూ, మిత్రులతోనూ తరచూ అంటూ ఉండటం వలన మిత్రులు కొంతమంది మొహమాట పడిపోయి వూరుకొన్నా మరికొందరి మాత్రం వూరుకోలేక "ఎప్పుడూ తాతలానాడు నేతులు తాగాం మా మూతులు



వాసన చూడండి అన్నట్లేనా? లేక తమరు విరచించిన కావ్య రాజం ఏమన్నా ఉందా?" అని నిలదీసి అడిగేసరికి తొలి రోజులలో మీన మేషాలు లెక్కెట్టినా, తరువాత కొంచెం కూడదీసుకుని,

"ఈ రోజులలో పద్య కావ్యాలకు విలువెక్కడండీ? అణా కాణీకి టికాణా లేని కథలూ, నవలలూ వచ్చి తెలుగు సాహిత్యం అధోగతికి దిగజారిపోయింది కదా! ఇలాంటి రోజుల్లో కావ్యాలు రాసి బాధపడే కంటే వ్రాయకుండా వూరుకోవడం మంచిది" అనేవాడు.

అయితే

అందరూ అంతటితో వూరుకుంటే కథే లేదు మరి!

"పోనీ.... ఆధునిక సాహిత్యాన్నే ఏ్రలాదూ?" అనేవారు.

"చెత్త వెధవ సాహిత్యం రాసేకంటే వూరుకుంటే మంచిది" విఠలరావు అనేవాడు.

"చేతకాదని చెప్పరాదూ? మాది పండిత వంశం అని పెద్ద బడాయి. పండిత పుత్ర శుంఠ అని వూరికే అన్నారా?"

పుల్ల విరుపుగా కొందరనేనరికి విఠలరావు అహం దెబ్బ తింది. తీవ్రమయిన మనస్తాపానికి గురైనాడు. ఎలాగైనా కావ్యం వ్రాసి వాళ్ళ ముఖాన కొట్టాలనుకున్నాడు. అహో రాత్రులూ శ్రమించాడు, ఆఫీసు పని మానేసి అప్ప కవీయాలూ, అనంతుని చందస్సులూ తిరగేసాడు. కొరుకుడు పడలేదు ట్రిగ్నామెట్రీ కంటే ఇదే కష్టంగా అనిపించింది. కాగితాలకు కాగితాలే వేస్టయిపోయాయి. కనీసం వో గీత పద్యం కూడా బక్కర లేకపోయాడు. 'ఇన్ని' అష్ట కష్టాలు పడి అంత కవిత్వాన్ని ఎలా రాశారు, పితామహులారా? వాళ్ళందరికీ సహస్ర నమస్కారాలు చేసేసి పద్య కవిత్వానికి గుడ్‌బై చెప్పేశాడు.

కనీసం వో నవలయినా రాయకపోతే పరువు దక్కదు అనకున్నాడు. వాళ్ళావిణ్ణి పిలిచాడు. ''అవునే! నువ్వో నవల రాయకూడదూ? ప్రతి అప్పల్నరసమ్మా ఎడం చేత్తో రాసి పారేస్తూంది కదా?'' అన్నాడు.

''కుడి చేత్తో ఉత్తరం ముక్క రాయటానికి దిక్కులేదు కాని, ఎడం చేత్తో నవల రాయాలట. మా నాన్నని తొందర పెట్టేసి కొన్నాళ్ళు ఆగమన్నా ఆగకుండా పెళ్ళి చేసేసుకున్నారు పెద్దదాన్నవగానే. (మేనరికం అన్నమాట!). ఇప్పుడేమో గంపెడు సంసారంతో చావడానికే తీరిక లేకుండా ఉంటే నవలొహటీ.... నామోహానికి! సిగ్గు లేకపోతే సరి!'' భార్యా మణి కొట్టినంత పని చేసేసరికి నోరు మూనుకుని అక్కణ్ణుంచి వెళ్ళి పోయాడు. విఠల్‌రావు.

తరవాత విఠల్‌రావు కొన్నాళ్ళు నిద్ర పోలేదు. ఎన్నో పత్రికలు, పాత నవలలూ, కథలూ అన్నీ చదివి మొత్తం మీద ప్లాట్ తయారుచేసుకున్నాడు. గంపెడు సిగరెట్ పీకలూ బస్తాడు రఫ్ కాఫీలనీ తయారు చేసి వో నూటయాభయి పేజీలు నింపడానికి పురిటి నొప్పులు పడ్డాడు. దాన్ని ఫెయిర్ చేశాడు. స్థానికంగా నాలుగు కథలు పడిన వో రచయితకు చూపెట్టాడు. రిటైరయ్యే దశలో ఉన్న విఠల్ నవల రాయడానికీ, నవల (స్త్రీ)ని కాంక్షించడానికీ వయస్సుతో నిమిత్తమేముందిలే అనుకొని తీరిగ్గా చదవడానికి పది రోజులు టైం అడిగాడు. అలాగే చదివాడు.

నవల పూర్తయేసరికి ఇంకా వాడని అమృతాంజనం సీసా ఒక్క పిసరు లేకుండా అయిపోయింది. ఈ నవల సీరియల్‌గా వేస్తే ప్రచురించే పత్రిక సర్క్యులేషన్ మాటెలా ఉన్నా అమృతాంజనం కంపెనీ, తలనొప్పి మాత్ర కంపెనీలు మాత్రం బ్రహ్మాండమైన లాభాల్ని ఆర్జిస్తారవడంలో ఢోకా లేదు అనుకున్నాడు రచయిత. లేదా ఏ తల నొప్పి మాత్రల వాళ్ళయినా ఈ నవలని సీరియల్‌గా వేసేటందుకు ఏ పత్రికతో నైనా కంట్రాక్టు పెట్టుకుంటే అంటే నా కంపెనీకి వచ్చే లాభాల్లో పాతిక నీకు ఇస్తాను నీ పత్రిక పడిపోకుండా చూచే ఉభయత్రా లాభాలు పొందే వారవుతారని మందుల కంపెనీకి రికమెండ్ చేసే వాళ్ళెవరయినా ఉంటే బాగుంటుంది. అని పించింది రచయితకి.

కానీ-

''ఎలా ఉంది, సార్, నా నవల? విశ్వనాథ వారి వేయి పడగల్లా ఉందా? చిలకమర్తి వారి గణపతిలా ఉందా? బాపిరాజు గారి నారాయణరావు లా ఉందా?'' అని విఠల్ రావు రచయితను అడిగేసరికి రచయితకు వూపిరందలేదు. ఇంట్లో కెళ్ళి గ్లాసుడు చల్లని నీళ్ళు త్రాగేసి తెప్పరిల్లి వచ్చాడు. అప్పుడన్నాడు. "ఛీ...ఛీ...! అలాటి వాళ్ళతో పోలుస్తా రేంటి? అంటే నా ఉద్దేశ్యం మీ నవల బాగులేదని కాదు, విశ్వనాథ వారి 'వేయి పడగలు వోపికతో

ఎంత మంది చదవ గలరు చెప్పండి? అలాగే బాపిరాజు, చిలకమర్తి వారి నవలలు అప్పట్లో పేరు తెచ్చుకొంటే తెచ్చుకోవచ్చుగాక! వాటిని ఇప్పుడెవరు చదవగలరు? మీ నవల వంద సంవత్సరాలయినా మరిచిపోలేం. అసలు మీ నవల మీ దెవరైనా థీసిస్ వ్రాసినా రాయొచ్చండీ! ఆ పరాంకుశం పాత్ర పేరిందేవి పాత్రా ఉంది చూశారూ అద్భుతం! పాఠకుల హృదయ ఫలకం మీద చెరగని ముద్ర వేస్తాయి. సార్! అయితే బండిరాలు (ఱ) అరసున్నలూ తీసేసి పూర్తి వ్యవహారికం మాత్రం చెయ్యాలి" అన్నాడు.

ఇంతటి మంచి కాంప్లిమెంటు రావడంతో విఠల్ రావు త నో మహా రచయిత అయిపోయినట్టూ ఫీలయిపోయాడు. తన నవలను అంతగా మెచ్చుకున్న రచయిత నోట్లో సిగిరెట్టు పెట్టి అగ్గిపుల్ల అంటించాడు. అలవాటు లేదన్నా వినకుండా తరువాత హోటల్లో టిఫిన్ ఇప్పించాడు. సినిమాకి తీసి కెళ్ళాడు. అంతా అయిన తరువాత "మీ రింకోలా అనుకోకపోతే ఆ మార్పులు మీరే చేసేసి ఫెయిర్ చేసేస్తే మిమ్మల్ని మరో దేవునిగా భావించుకుంటా" నని మెహమాట పెట్టేశాడు. ఆ రచయిత విషం కలిపిన ఆహారం తెలిసి తింటున్నంత భయ పడిపోయాడు. ఎంత తప్పించుకోవాలన్నా తప్పలేదు.

ఎలాగై తేనేం నెలా పదిహేను రోజులు తన కథలు కూడా ఫెయిర్ చేసుకోవడం మానేసి, నవల పేరు మాత్రమే విఠల్‌రావ్ పెట్టినట్లుగ ఉంచి లోపల సరుకుని పూర్తిగా మార్చేశాడు. ఒరోజు విఠల్‌రావ్‌ని పిలిచి నవలంతా చదివి వినిపించాడు. విఠల్‌రావ్ తెగ మెచ్చుకున్నాడు. "అమోఘం, సార్ ఇంత బాగా రాసి దీన్నింకా ఏ పత్రికకూ పంపకుండా ఎందుకట్టే పెట్టు కున్నారు?" అని ప్రశ్నించాడు.

రచయితకు అర్థం కాలేదు. 'ఏమిటి పోస్టలు ఖర్చులు కూడా నన్నే భరించుకోమంటాడా కొంపతీసి?' అనుకున్నాడు. ఇబ్బంది ఫీలయ్యాడు. విఠల్ రావు అసహనంగా అటూ ఇటూ కదిలి, "ఇంతకీ నా నవల ఫెయిర్ చేయలేదా?" అని అడిగాడు. రచయిత అయోమయంగా చూస్తూ "ఇవ్వుడు చదివింది మీ నవలేనండీ! అక్కడక్కడ మార్పులు చేసి తిరిగి రాశానంతే!" అన్నాడు.

"ఏ..... ఏ..... ఏమిటి? నా నవలే నిజంగా నా నవలేనా? ఎంత అద్భుతం? ఎంత అద్భుతం? మీ జన్మ ఎన్ని రుణాలకీ తీర్చుకోలేను, సార్" అనేసి ఏదో పొరపాటు అన్నట్లు వెంటనే గుర్తించి "మీ రుణం ఎన్ని జన్మలకీ తీర్చుకోలేను, సార్" అన్నాడు. అని మనసులు కలిసిన తొలి రోజులలో చెక్కిలి ముద్దాడడానికి కింకా భయపడుతున్న కొత్త ప్రేమికునిలా రచయిత చేతిని ముద్దు పెట్టుకుని తరువాత రెండు చేతులతోనూ ఎత్తి కేదేశాడు.

"సార్! ఈ నవల మీకే అంకితం ఇచ్చేస్తున్నాను. దీని 'కృతిపతి' మీరే. మీరు అంగీకరించాలి. తప్పదు" అన్నాడు.

పత్రికల వాళ్ళు తన కథల్ని వెంటనే క్రికెట్ బంతిలా శరవేగంతో త్రిప్పి కొట్టేస్తున్నా, తననో ఆరాధ్య దైవంగా భావించే రచయిత శిష్యుడు లభించినందుకు కాఫీ, టిఫిన్లు, సినిమాలకు లోటులేనందుకు ముఖ్యంగా తాలూకాఫీసు వనులు (విఠలరావు తాలూకాఫీసు గుమస్తా) శరవేగంతో పైసా ఖర్చు లేకుండా పూర్తయి పోతున్నందుకు రచయితగారు సంబర పడ్డారు.

ఆ మరనాడే ఒక ప్రసిద్ధ వారపత్రికు నవలని రిజిస్టర్డ్ పోస్టులో పంపేశాడు

విఠల్‌రావు. పది రోజుల్లోనే పత్రికలవాళ్ళు నవలని జాగ్రత్తగా విఠల్‌రావు కందించేశారు.

"తన నవల సీరియల్‌గా వస్తున్నట్లు, త్వరలోనే మరో నవల రాయవలసి నదిగా పత్రికల వాళ్ళు తనను కోరినట్లు, పాఠకులు తన నవలను తెగ మెచ్చేసుకుంటూ ఉత్తరాలు వ్రాసినట్లు కన్న టెక్నికలర్ కలలు విరిగిపోయి తీవ్రమైన ఆశాభంగం కలిగించింది విఠలరావుకి, అంతే కాకుండా పోస్టుమాన్ ఆఫీసులో ఆడ, మగ, గుమాస్తాల సమక్షంలో తన, నవలను తీసుకు రావటం, వాళ్ళు ఇకిలించటం, సకిలించడం విఠలరావ్‌కి తల తీసి నట్లయింది.

అయితే, మండుటెండలో మలయ వవనంలాగా చిన్న విషయం మాత్రం విఠల్‌రావ్‌కి పరమసంతోషాన్ని కలిగించింది. నవల త్రిప్పి పంపుతూ పత్రికల వాళ్ళు "మీ నవలను త్రిప్పి పంపటంలో బాగులేదని మా ఉద్దేశం కాదు. మా సంపాదక పరిమితులకు లోబడి మీ నవలని ప్రచురణకు స్వీకరించలేక పోతున్నందుకు చింతిస్తున్నాం. ఇంత కంటే మంచి రచనను ఆహ్వానిస్తూ మీ సహాయ సహకారాలను సదా అందించ గలరని ఆశిస్తున్నాం'' అనే ఉత్త రాన్ని కూడా జతపరిచారు. ఆ ఉత్త రాన్ని చదివి ఎగిరి గంతేశాడు. ఆఫీసులో అందరికీ చూపెట్టాడు. "వాళ్ళ కేవో ఇబ్బందులున్నాయంటండీ, అందుకే రిటన్ చేసేశాడు.'' అన్నాడు. రచయితల గురించి, పత్రికల గురించి ప్రాథమిక పరిజ్ఞానం కూడా లేని ఆఫీసులో అందరూ మరేం అనలేకపోయారు.

సాయంకాలం ఆఫీసుటైం అవగానే తిన్నగా సైకిలు వేసుకుని రచయిత దగ్గరకు పరుగెత్తాడు, పార్శిలు సంచీ పట్టుకుని, రచయితకు గుండె ఆగినంత పనయింది. మళ్ళీ మరో నవల ఫెయిర్ కాపీ చెయ్యమంటాడేమోనని'

"నమస్కారం, సార్! ఖాళీయేవా?"

"ఆ.... ఏం ఖాళీ. మళ్ళీ ఆఫీసు పనుంది. వెళ్ళకతప్పదు" అన్నాడు.

"అంతేనండీ. మనం గాడిద చాకిరీ చెయ్యాల్సిందే సర్లెండి. అదెప్పుడూ ఉన్నదే! కాని...... ఒక శుభవార్త!"

రచయిత గుండె జల్లుమంది. కొంపతీసి ఇతని నవల్ని ఆ పత్రికవాళ్ళు సీరియల్‌గా వేసెయ్యటం లేదుకదా? భగవంతుడా! ఇదన్యాయం నా కథలు రిటనయిపోయి, నేను ఫెయిర్ చేసిన ఇతని నవల ప్రచురణ యోగ్యమా? హతవిధీ! రచయిత మనసులో అగ్ని జ్వాలల భుగభుగలు!

"ఏమిటండోయ్?" తేరుకుని అడిగాడు,

"మన నవల రిటన్ చేశార్, సార్!"

రచయిత గుండాగిపోయింది. విఠల్‌రావు నవల రిటనయినందుకు కాదు. విఠల్‌రావు ఈ విషయాన్నింత స్పోర్టివ్‌గా ఎలా తీసుకోగలిగాడా? అని! తనకి బాగా గుర్తు, తను డిగ్రీ చదువుతున్న రోజులలో కథా రచన ప్రారంభించాడు. తన మొట్టమొదటి రచనను ఎంతో ఆశతో పంపితే తన ఆశలను చంపేస్తూ నెలరోజులలో అది ఇంటి పట్టున చేరుకుంది వచ్చి. ఆ రోజు తన రోదన జీవితంలో పెళ్ళయిన మరుదినాన శోభనం రాత్రి జరగబోతుందనగా పెళ్ళి కొడుకు చనిపోతే నవవధువు ఎంతలా హృదయ విదారకంగా రోదిస్తుందో అంతలా ఉంది. మరి ఇతగాడి కింత హుషారెలా వచ్చింది? ఏమిటీ చిదంబర రహస్యం? అనుకొని "అయితే అది శుభవార్త ఏమిటి, సార్?'' అన్నాడు.

"వస్తా. వస్తా. ఆ పాయింట్‌కే వస్తా, మీరలా ఖంగారు పడతారని నాకు తెలుసు" అని జేబులో చెయ్యి పెట్టాడు. రచయిత గుండె నస్సెన్సు తట్టు కోలేక ఎక్కువే కొట్టేసుకుంటున్నదో, తక్కువ కొట్టుకుంటూ, ఆగిపోతున్నదో అతనికి అర్థం కావటం లేదు. ప్రచురణకు స్వీకరించినా, జోక్ చేస్తున్నాడేమో ననుకున్నాడు.

విఠలరావు ఒక కాగితం తీసి రచయిత కందిచాడు. "మన నవల రిటన్ చేస్తూ వాళ్ళు సర్టిఫికేటిచ్చారు సార్! నవల నచ్చిందట కానీ..... వాళ్ళ కేవో ఇబ్బందులవలన ప్రచురించ లేకపోతున్నారట. ప్రత్యేకంగా ప్రింటు కూడా చేసి పంపించారండోయ్!" అంటుంటే రచయిత అతని సంతోషాన్ని పాడు చెయ్యడం ఇష్టంలేక కిమ్మనక పూరుకున్నాడు.

అలాటి ఉత్తరాలు తన పెట్టెనిండా చాలా ఉన్నాయనీ, అవన్నీ అమ్ముకుంటే (తూకానికి) ఒక ట్రాన్సిస్టరు రేడియో కొనుక్కోవచ్చని చెప్పి అతని ఆనందాన్ని హత్యచేసే హంతకుడు కావటం రచయితకు నచ్చలేదు. ఆ తరువాత నవలను పత్రికలకు పంపడం, వాళ్ళు వెంట వెంటనే తిప్పికొట్టడు రికార్డు స్థాయిలో జరిగింది. దేశంలో ఉన్న ఒకే పావులావులో వస్తున్న పత్రికల నుంచి లక్షల సర్క్యులేషన్ గల వార, మాస పత్రికలన్నిటికీ విఠల్‌రావు నవల వెళ్ళొచ్చేసింది. దాంతో పుట్టక పుట్టక పుట్టిన ఏకైక సంతానం చేతి కందొచ్చిన టైంలో పోయినంత బాధపడి పోయి రచయిత దగ్గరకొచ్చి, "ఏమిటి, సార్! ప్రతి పత్రికా రిటన్ చేసేస్తోంది. విశేషం చూశారా? ప్రతి వాళ్ళూ మళ్ళీ బాగుందనే అంటున్నారు" అన్నాడు.

'హయ్యో! విఠలా.... పాండురంగ విటలా! అది కన్నీటి తుడుపయ్యా, బాబూ? ఇంత అనుభవం సంపాదించినా ఇంకా గుర్తించలేదు?' అని మనుసులో అనేసుకుని పూరుకున్నాడు.

"ఒక జ్యోతిషుణ్ణి సంప్రదిచాను, సార్! ఒక పదిపోతే పోయిందని. తవ్వక ప్రింటవుతుందన్నాడు." విఠల్‌రావు అన్నాడు.

రచయిత ఆలోచించాడు. పత్రికలకు పంపడానికి అయిన ఖర్చుతో నవలే సొంతంగా ప్రింటుఅయిపోయి ఉండేదేమో అనుకున్నాడు. అనుకొని "విఠల్‌రావుగారూ! వే నో ఐడియా ఇస్తా, అలా చెయ్యగలరా?" అన్నాడు.

"చెప్పండి. సార్"!

"ఒక అయిదు వేలున్నాయా?"

"అయిదువేలా? ఎందుకూ?"

"ముందు చెప్పండి. ఉన్నాయో, లేవా?"

"సరే డబ్బు కేముంది? ఎలాగో ప్రయత్నిద్దాం."

"శుభ్రంగా మనమే ప్రింటు చేసేసి ఏ పబ్లికేషన్సు కయినా అమ్మేస్తే బాగుంటుందేమో. లేదా మనమే స్వయంగా అమ్ముకున్నా ఫరవాలేదు" అని మళ్ళీ "రెండు వేల కాపీలు వేద్దాం. పది రూపాయల ధర పెడదాం. అసలు ఖర్చులు పోగా పది పన్నెండువేలు తప్పక మిగల్తుంది" అన్నాడు.

ఎగిరి గంతేశాడు విఠల్‌రావు.

కానీ 'అయిదు వేలెక్కడివీ?' ప్రశ్న

పెళ్ళినాటి భార్య కళ్ళముందు కనిపించింది. ఆవిడ మెళ్ళో ఉండే మూడు పేట్ల గొలుసు, నదుటిమీద వేలాడే పాపిట చేరూ, జడలో మెరిసే నాగరం, చేతికి ఉండే గాజులూ కనిపించాయి. ఎలాగోలా భార్యని ఒప్పించాలనుకున్నాడు. పదిరోజులు భార్య పాదాలు వదలకుండా పట్టుకున్నా లాభం

లేకపోయింది. ఇంతకంటే ఏ సంపాదకుని కూతుర్నో తన కొడుక్కి కట్నం లేకుండా చేసుకుంటా నంటే కొంత ప్రయోజనం ఉండేదేమో అనుకున్నాడు. తనకు తెలిసిన వాళ్ళ ద్వారా ఎంక్వయిరీ చేస్తే ఒక పది పేజీల వార పత్రిక సంపాదకుడు ఒకాయన కనిపించినా, అతనికందరూ పెళ్ళిళ్ళయి పోయిన మగ పిల్లలే. ఆ ప్రయత్నం ఫలించలేదు. ఆలోచించేకొద్దీ విఠలరావు బుర్ర పదునెక్కిపోయింది. బలే అయిడియా వచ్చేసింది. ఈ సంఘటన ద్వారా విఠల్‌రావుని రచయితగానే కాదు నటుడుగా కూడా మనం భావించవచ్చు.

రెండు నెలలు గడిచాయి. (ఈ రెండు నెలలూ నగల ప్రసక్తి భార్య దగ్గర తేలేదు) తరువాత ఒక రోజు ఆఫీసునుంచి దిగాలుగా వచ్చాడు. లక్షల రూపాయలు కూతురు పెళ్ళికి కట్నంగా ఇద్దామని బాంకునించి వూడిచి తెస్తుంటే తోవలో ఎవడోతన్ని లాక్కుంటే ఎలా ఉంటాడో అలా ఉన్నాడు విఠలరావు.

భార్య కాఫీ ఇస్తే తాగలేదు. తరవాత మసుగు తన్నాడు మంచం ఎక్కి. భార్య కంగారెత్తి పోయింది. ఎన్నో విధాల ప్రశ్నించింది. "వంట్లో బాగాలేదా? ఏమయింది? ఎందుకలా ఉన్నారు?" ఇలా ప్రశ్నలు వేసి విసుగెత్తిపోయి ఏడుపు లంకించింది. పెళ్ళికావలసిన ఆడపిల్ల తండ్రి కేమయిందోనని తల్లితోనే ఏడిచింది. విఠల్‌రావు పరిస్థితి గమనించి అసలు విషయం మెల్లగా చెప్పాడు. "నా ఉద్యోగం అప్పుడు పర్మనెంటు చెయ్యలేదు వాళ్ళు. టెస్టులు కాలేదని. ఇప్పుడారు వేలు లంచం అడుగుతున్నారు. లేకపోతే ఉద్యోగం వూడిపోవడం ఖాయం! ఈ పిల్లల్తో నేనే ఏట్లో దూకాలో తెలీడం లేదు." బావుర మన్నాడు. భార్య లబోదిబో మంది.

"గట్టిగా ఏడవకు. నలుగురికీ తెలిస్తే ఇక బ్రహ్మ దేవుడు కూడా మనల్ని రక్షించలేడు" అన్నాడు.

కళ్ళు తుడుచుకుంది. ఏమిటి చెయ్యాలా అని ఆలోచించింది. పుట్టింటికి వెళ్ళినా లాభం లేదనుకుంది. ఉద్యోగం పోతే ఎలాటి దరిద్రాన్ని అనుభవించాలో వూహించుకుంది. బతికుంటే బంగారాన్నెలా అయినా సంపాదించుకోవచ్చు అనుకుంది. బీరువా తెరచి గొలుసూ, గాజులూ తీసి రుమాల్లో కట్టి విఠలరావు కిచ్చింది. వీటితో ఉద్యోగం నిలబెట్టుకోమంది. "అవునే, అవి నీ పుట్టింటివారు పెట్టినవే, వీటి నెలా అమ్మడమే? నాకు చేతులు రావడం లేదు" అన్నా విషణ్ణంగా.

"పరవాలేదు. రిటైరయ్యాక మళ్ళీ కొందరు గాని, ముందు ఉజ్జోగం నిలబెట్టండి" అంది.

"ఈ విషయం రెండో కంటికూ్కడా తెలియకూడదుసీ్మ. తెలిస్తే ఆఫీసరు మరి పుచ్చుకోడు" అన్నాడు. భార్య తలూపింది.

ఆ తరువాత రచయిత సహకారంతో మూడు నెలలో మంచి ఆర్టిస్టు చేత కవరు పేజీ రాయించి, నవలని అచ్చులో ముచ్చటగా చూసి మురిపిసోపోయాడు.

ఇక్కడికి పూర్వరంగం అయిందనాలి.

తరువాత....

రచయితను అండదండగా ఉంచుకుని పుస్తకావిష్కరణ మహోత్సవాన్నేర్పాటు చేసుకున్నాడు విఠల్‌రావు. పుస్తకావిష్కరణానికి స్థానిక సబ్‌కలెక్టరుగార్ని ఒప్పించాడు. నవల గురించి రచయితను మాట్లాడమన్నాడు. ఉత్సవానికి నగరంలో ప్రముఖుల్ని, సాహితీవేత్తలనీ (ఆముదపు చెట్లే) ఆఫీసు స్టాపునీ అందరినీ ఆహ్వానించాడు. సభ బాగా

జరిగింది. కలెక్టరుగారు 'వెలగని దీపాలు' నవలని ఆవిష్కరిస్తే, రచయిత ప్రసగించాడు. ఆఫీస్‌స్టాప్ విఠల్‌రావుని దుశ్శాలువతో సన్మానించారు. బిస్కట్లూ, టీలూ కూడా విఠల్‌రావే ఏర్పాటు చేశాడు. పుస్తకాలు ఎవరైనా కొంటారేమోని వేదికపైనే దొంతులుగా ఉంచాడు. కలెక్టరుగారు వంద రూపాయలిచ్చి పుస్తకం తీసుకున్నారు. వద్దన్నా ఆయన వినకుండా వందా విఠలరావుకు ఇచ్చేశారు. తాశిల్దారుగారు మాత్రం నవల తీసుకొని, 'మా అమ్మాయి నవల్లు తెగ చదువుతుంతోయ్, రచయితా! నాకు వీటితో పెద్దగా టచ్ లేదనుకో' అన్నాడు. 'రచయితా' అని తనని పిలిచినందుకే ఉబ్బిపోయాడు విఠల్‌రావు. జేబులో చెయ్యి పెడతాడేమోనని చూశాడు కానీ, విఠల్‌రావు ఆశ ఫలించలేదు. వస్తానంటూ అతను వెళ్తున్న వైపే బిక్క ముఖం వేసుకుని ఉండిపోయాడు. కొంతమంది పుస్తకాన్ని క్రిందా మీదా చూసి వెళ్ళిపోయారు. కొంతమంది "ఉంచండి తరువాత తీసుకుంటాం" అన్నారు. ఆఫీసు స్టాఫ్‌లో అందరూ తీసుకున్నారు. అందరూ అరువే పెట్టారు. ఆ రోజు చేతికందిన డబ్బుమూడూ యాభై. దాంట్లో పార్టీ ఖర్చులు తీసేస్తే మిగిలింది యాభై.

ఫస్టొచ్చింది. రోజూ ఆడే పేకాట బాకీల నుంచి పార్టీలకయ్యే ఖర్చుల వరకూ వాళ్ళాఫీసులో జీతలనాడే కటింగ్ చేయడం రివాజు. అందునుంచి తన నవల డబ్బులు అందుతా యనుకున్నాడు. ఎవరూ ఇచ్చే మొహాలుగా కనిపించలేదు. వారం రోజులు చూశాడు. అడిగేశాడు.

"అయ్యో. సారీ సార్! మరిచేపోయాం. మరి ఆరోజు గుర్తు చేయకపోయారా? ఇచ్చేసేద్దుం. ఇప్పుడన్నీ అయిపోయి చేతులు కడిగేసుకున్నాం". అన్నారు. తరువాత నెల జీతం అందిన రోజే అడిగాడు. "ఏమిటి సార్! కాబూలీవాడయినా కాస్త ఆగుతాడు. నక్షత్రకుని అప్పులా ఉంది. తరువాత ఇస్తాం లెండి" అన్నారు. ఆ మర్నాడు చూశాడు. కొందర్ని అడగ్గా- "సారీ సార్! చాలా ఇబ్బందిగా ఉంది. మీరెవరికయినా అమ్ముకొండి" అని పుస్తకాలు తిరిగిచ్చేశారు. కొందరు మూడు, కొందరు అయిదు ఇచ్చి తరువాత మిగిలిన డబ్బు లిస్తామని ఎగనామం పెట్టేశారు.

ఇంట్లో కట్టలు కట్టలుగా ఉన్న పుస్తకాలు చూసి భార్యకి కోపం వచ్చింది. "ఏమిటండీ ఇవి? ఇల్లు కడుగుదామన్నా వీల్లేకుండా మనింట్లో ఎందుకివి?" అంది.

అలా అనటానికి కారణం ఉంది. విఠలరావ్ భార్య పోలీసు కుక్కలాటిది. ఏమాత్రం ఆ పుస్తకాలు తను రాసిన నవల కాపీలని తెలిసినా, బంగారం గుట్టు బయటపడిపోతుందని పుస్తకం కనిపించకుండా పేక్ చేసి అవి ఆఫీసు పుస్తకాలని కమ్మగా అబద్దం అడాడు.

"ఆ.. మరోనెల పోషిక పట్టు, తీసుకెళ్ళి ఆఫీసులో పడేస్తా" అన్నాడు. రచయిత సలహామీద కొన్ని పుస్తకాల షాపుల వాళ్ళవి కాంటాక్టు చేశాడు. ఏ పబ్లిషర్లు ప్రింటు చేసిందీ వగైరా వివరాలు కనుక్కున్న తరువాత వాళ్ళు పెదవి విరిచేశారు. కొన్ని పుస్తకాల షాపుల వాళ్ళు పుస్తకం అమ్ముడుపోయే దాకా డబ్బులు అడగరాదనే ఒప్పందం మీద పుస్తకాలు తీసుకున్నారు. అయితే ఆరు మాసాల్లో పదికాపీలు మాత్రమే అమ్మి, మిగతావి తిరిగి ఇచ్చేశారు.

విఠల్‌రావు రచయిత కీ విషయం చెప్పాడు.

రచయిత ఆలోచించి "పుస్తక సమీక్షకు పంపితే పుస్తకానికి పబ్లిసిటీ వచ్చి బాగా సేల్

కావచ్చు" అన్నాడు. విసుగెత్తిన విఠల్‌రావు పట్టు వదలని విక్రమార్కునిలా పది పత్రికలకి రెండేసి కాపీలు చొప్పున పంపించాడు. కొందరు తమ పత్రికల్లో నవల పేరు, రచయిత పేరు, ధర, ప్రాప్తిస్థానం వేసి ఉరుకున్నారు. కొన్ని పత్రికలు నవలని ఎక్కడ పడేశారో ఆ విషయమే తెలియలేదు. సమీక్ష బాగుంటే నవల అమ్మకం బాగుంటుందని ఆశించాడు. ఒక పత్రికలో చాలా పెద్ద సమీక్షేవచ్చింది. కాని సమీక్ష చదివాక బాంబ్రు మన్నాడు విఠలుడు. సాయంకాలం రచయితతో సమీక్ష గురించి చెప్పాడు.

"కనీసం ఏ పదం ఎక్కడ వాడాలో తెలీనివాళ్ళూ, ప్రశార్థకాలూ ఆశ్చర్యార్థకాలూ వాడడంలో కూడా భేదం తెలీని వాళ్ళూ నవలలు వ్రాసేయడానికి సాహసించబట్టే తెలుగు సాహిత్యం ఇంత అధోగతికి దిగజారి పోయింది అవటానికి 'వెలగని దీపాలు' ఒక ఉదాహరణ. (ఈ దీపాలు వెలగ లేదు కాబట్టి సరిపోయింది. వెలిగితే 'తెలుగు సాహిత్యం' భగ్గున మండి పుస్సున బూడిదవును!)

తెలుగు పాఠక మహాశయులారా! మీరంతా ఇలాటి నవలలు చదివి 'తెలుగు సాహిత్యం' అంతా ఇంతేననుకొనే ప్రమాదం ఉంది. తెలుగు భాష కమ్మదనాన్ని చాటి చెప్పే పుస్తకాలు కొల్లలు ఉన్నాయి.

అందుకే ఈ భాషని ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అన్నారు. మన సాహిత్యంలో అనర్ఘ రత్నాలున్నాయి. ఏ బాషలోనూ లేని కమ్మదనం మన భాషలో ఉంది. ఇలాటి నేటి నవలలు చదివి తెలుగు దీపం అర్పకండి!

ఆధునిక కుర్రతెలుగు రచయిత (త్రు)లారా!

మీరు కనీసం పెద్ద బాల శిక్ష కూడా చదువుకోలేదా? మీ నాన్నమ్మలూ తాతయ్యలూ గుణింతాలు కూడా సరిగా నేర్పలేదా?

మీకో మనవి, మీరందరూ విఠలరావుగారి నవల తప్పక చదవండి. చదివి మీరు తెలుసు కోవలసిన విషయాలు చాలా ఉన్నాయ్. ఏమిటంటే నవల ఎలా వ్రాయాలి? అన్నది కాదు ముఖ్యం! ఎలా వ్రాయకూడదూ అన్నది ప్రధానం. అందుకోసం మీరు 'వెలగని దీపాలు' చదివి తీరాలి" ఇలా సాగింది ఆ సమీక్ష.

విమర్శ చదివిన రచయిత ముఖం మసిబారిన చిమ్నీలా తయారయింది. ఆ నవలా రచనలో తన హస్తం ఉంది కాబట్టి కొంత సేపటికి తేరుకున్నాడు ఇంట్లో కెళ్ళొచ్చాడు. చెంబుడు నీళ్ళతో ముఖం కడుక్కొని వాళ్ళావిడ చేత రెండు గ్లాసుల్లో కాఫీ పోయించి తెప్పించాడు. అప్పటికి రచయిత ముఖం కిరణ జన్య సంయోగ క్రియ జరగని గోలాం క్రింద మొక్కలా అయింది. విఠల్‌రావుని చూస్తుంటే తెగ జాలి వేసింది. ఎలాగైనా అతన్ని వోదార్చాలనుకున్నాడు.

"ఆ విమర్శ రాసిందెవరో చూశారో లేదో? మన కులం కాదు. కుల ద్వేషం మనసులో పెట్టుకుని అంత ఘోరంగా రాశాడు. అంతేకానీ, మీ నవల బాగులేదంటే నేను ససేమిరా అంగీకరించను." ఆ మాటలు నిజంకావని రచయితకీ తెలుసు.

"మన పేరును బట్టే వాడు కులాన్ని పోల్చే శాడండీ?" విఠల్‌రావు అన్నాడు. రచయితగొంతులో వెలక్కాయ పడింది విఠల్‌రావు అమాయకంగా అన్నాడో గడుసుగా అన్నాడో అని రెండు నిమిషాలు అతని ముఖంలోకి చూశాడు. విఠల్‌రావు ముఖంలో గడుసుతనం టార్చిలైటు పెట్టి వెతికినా

కనిపించలేదు. అందునుంచి వెంటనే తగులు కున్నాడు.

"పేరును బట్టి కాదండీ మీ నవలలో పాత్రల పేర్లు చూడండి. పేరిందేవి, పోమిదేవమ్మ, పరాంకుశశర్మ, సోమయాజులూ ఇక శైలి చూద్దాం. 'ఒళిపొచ్చాడు' నీ శార్థం, వణ్ణం 'భోయినం' ఈ వదాలెవరు ఉపయోగిస్తారు. బ్రాహ్మలే. పోతే మీ నవలలో ఎక్కడయినా నాన్ విజిటేరియన్ పదార్థాల గురించి రాశారా? శ్రీనాథుని కావ్యాలు చదివితే అన్ని బ్రహ్మణ పిండి వంటలే కనిపిస్తాయి. నాయక రాజుల కావ్యాలు చదివితే కప్పురపు కోడి, ఆకోడి, ఈ కోడి అని ఎన్ని రకాల కోళ్ళ గురించి చెప్పారు? అంతెందుకండీ? ఆముక్త మాల్యదలో చేపల పులుసు గురించి రాయడం నుంచేకదా దాన్ని కృష్ణ దేవరాయల కర్తృత్వంగా నిర్ధారణ చేసింది!" ఇలా తనకు తెలిపిన విషయాలూ తెలీని విషయాలూ జోడించి విఠలరావుని వోదార్చాడు. రచయితని విఠలరావు ఎంత గొప్పగానో ఊహించేసుకున్నాడు.

"మీ కెందుకు? మా ఫ్రెండ్సందరికీ ఉత్తరాలు రాసి నవల్ని, అమ్మించే పూచీనాది. కాకపోతే టెన్ పర్సంట్ కమీషన్ ఇద్దాం" అన్నాడు.

విఠల్‌రావు ముఖం నీరులేని చెరువంతయింది.

"థ్యాంక్సు,సార్ మీరుణం ఎన్ని జన్మలకీ తీర్చుకోలేను. సెకెండు షోకి కెళ్దాం వస్తారా?" అన్నాడు. సరే అన్నాడు రచయిత, విఠలరావు టిక్కెట్లు తీయబోతే బలవంతాన అతన్ని ఆపు చేయించి తన డబ్బుల్తోనే టిక్కెట్లు తీశాడు రచయిత.

ఒక రోజు -

విఠల్‌రావు ఆఫీసు నుండి వచ్చేసరికి పెళ్ళాం ఇల్లు కడుగుతూంది. నీరంతా పుస్తకాల క్రిందికి చేరిపోయింది. నవల కట్టలు అడుగున తడిసి పోతున్నాయి. విఠలుని ప్రాణం పోయినంత పని అయింది. "అయ్యయ్యో! కట్టలు తడిసి పోతుంటే కనిపించట్లేదూ?" కస్సు మన్నాడు భార్యమీద.

"ఏళ్ళ తరపడి ఆఫీసు కట్టలు ఇంట్లో తగలేస్తే ఎలా అవుతుందను కున్నారు? ఇల్లెన్నాళ్ళు కడుక్కోవడం మానేస్తాం? అంతగా మీకు ఆఫీసర్ దగ్గర భయం అయితే వాటినా ఆటక మీదకి విసిరేయండి" అని బుస్సుమని ఛర్రున వెళ్ళి నిచ్చెన తెచ్చి పుస్తకాల కట్ట ఆటక పైకి ఎక్కించేసింది. పోనీ అటకమీదే కదా అని ఉరుకున్నాడు.

రచయిత కలిసి నప్పుడల్లా విఠల్‌రావు నవల అమ్ముడు పోనందుకు తెగ బాధ పడిపోయేవాడు. ఒసారి విఠల్‌రావు కలిసి నప్పుడు

"విఠల్‌రావుగారూ! మన నవల అమ్ముడు పోవాలంటే ఒక పథకం ఆలోచించానండీ" అన్నాడు.

"చెప్పండి సందేహం ఎందుకు?"

"మరేం లేదు. ఈ మధ్య ఒక నవలని నిషేదించారు. నిషేదించాకే ఆ నవల గిరాకీ బాగా పెరిగిపోయిందనుకొండి. దాన్ని రహస్యంగా రీప్రింటు కూడా చేశారట."

"అహ..... అయితే ఏమంటారు?"

"మనం నవలనీ నిషేధిస్తే బాగుంటుందేమో అనిపిస్తూంది."

"బలే అయిడియా అండోయ్ కానీ, ఎలా సాధ్యం?"

"ఆ ప్రయత్నం మనమే చేయాలి!"

ఆలోచించారు తీవ్రంగా విఠలరావు ఎగిరి గంతేశాడు. "నాకో బ్రహ్మాండమైన

ఐడియా వచ్చింది. ఇలారండి. దగ్గరకి'' అని రహస్యంగా రచయిత చెవిలో గొణిగాడు. రచయిత కళ్ళల్లో నక్షత్రాలు మెరిశాయి. సరిగ్గా అప్పుడే అసెంబ్లీ ఎన్నికలు అధికార పార్టీ తరుపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యేగారి మీద సినిమా పాటల స్టైయిల్లో మూడు గీతాలు రాసి నేరుగా అతనికే ఇచ్చి, "సార్! మీరు నాకు నచ్చారు. అందుకే ఈ పాటలు రాశాను, మీ తరవున ప్రచారం చేయ్యాలని ఉన్నా గవర్నమెంటు సర్వెంటుని. కుదరదు. ఎవరి చేతయినా ట్యూన్ కట్టించి పాడించండి, సార్. తప్పక మీరు గెలుస్తారు మళ్ళీ" అన్నాడు. అతను ఆ పాటలు చదివాడు. అతనికి నచ్చాయి. అడక్కుండా రాసిచ్చినందుకు పొంగిపోయి బీరువాతీసి నూట పదహారు రూపాయలు విఠల్‌రావు చేతిలో పెట్టాడు.

విఠల్‌రావ్ పుచ్చుకోలేదు. "నేను మీ నుంచి ఏం ఆశించి చేయలేదండీ. ఎందుకో మీరు నచ్చారు రాసిచ్చానంతే'' అని వెళ్ళిపోయాడు.

అనుకున్నట్లే విఠల్‌రావ్ సపోర్టు చేసిన అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే విఠలరావు అంత గ్యారంటీగా అతనే గెలుస్తాడని భావించటంలో అర్థం లేకపోలేదు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారి పార్టీకి ఎంత విలువ ఉందో విఠల్‌రావుకి తెలుసు నంబర్ టూ స్వాతంత్రం వచ్చాక జరిగిన ఎన్నికల్లో ఆ సీటు ఎప్పుడూ అధికారి పార్టీదే.

గెలిచిన వెంటనే ఎమ్యెల్యే గారు విఠల్ రావ్‌కి కబురుచేసి మంచి పార్టీ ఇచ్చారు. విఠల్‌రావు తెగ మురిసిపోయాడు. అతను ఆ నియోజక వర్గం నుంచి ఎన్నికవడమే గాక, అపోజిషన్ వాళ్ళ డిపోజిట్లను కూడా గల్లంతు చేసిన అతన్ని మెచ్చి అదిష్టాన వర్గం పిలిచి మంత్రి పదవిఇచ్చారు. అదీ సాంస్కృతిక వ్యవహారాలూ, ఆకాడమీలు!

విఠలరావు కుప్పించి గెంతాడు. ఆ తరువాత మంత్రిగారికి ఏర్పాటైన సన్మాన సభలో రచయితా, విఠల్‌రావూ శబ్ద రత్నాకరం దగ్గరుంచుకుని మంచి పదాలు ఏరి సన్మాన పత్రం రాస్తే అదే చదివాడు.

మంత్రిగారి సన్మానం బ్రహ్మాండంగా జరిగింది. విఠల్‌రావ్‌కి మంత్రిగారి దగ్గర పలుకుబడి బాగా పెరిగింది.

ఆ రాత్రి

మంత్రిగారి మద్దతుదార్లు మంత్రిగారికి తలోపనీ అప్పచెప్పారు. కొందరు తమ పిల్లలు ఉద్యోగాలన్నారు. కొందరు కాంట్రాక్టులన్నారు. కొందరు మెడిసిన్‌లో సీట్లు అన్నారు. రకరకాలుగా చెయ్యమన్నారు. అందర్నీ సాగనంపి మంత్రిగారు నిద్రపోయే సరికి విఠల్‌రావ్ స్ఫురణలోకి వచ్చాడు. 'ఇంత మంది ఇన్ని సహాయాలు అర్థిస్తున్నారు. విఠల్‌రావ్ ఒక పనీ చెయ్యమని అడగడేం?' అనుకున్నారు, తెల్లారగానే విఠల్‌రావ్‌కి కబురు చేశాడు. ఉరుకుల పరుగులతో మంత్రిగారి ఇల్లు చేరుకున్నాడు. విఠలరావుని తన ప్రక్క కుర్చీలో కూర్చోమని,

"ఇదిగో విఠలరావు! నువు హెడ్ గుమస్తాయేనా?"

"అవును సార్!"

"నిన్ను డి.టి.ని. చెయ్య మంటావా? తాశిల్దార్ని చెయ్యమంటావా?"

"ఏదీ ఒద్దుసార్! అని, నేను ప్రమోషన్ లిస్టులో ఉన్నాను. ఇప్పటికే మీ ద్వారా నేను ప్రయోజనాలు పొందేస్తున్నానని జనం గోల పెట్టేస్తున్నారు. మీకా చెడ్డపేరు రావటం నా కిష్టం లేదు."

''వహ బావుందయ్యా! సిరిరా మోకాలొడ్డినట్టుంది. నీ వెవహారం. బాపన య్యావి నీ రుణం నేనుంచుకోలేను. నేనోదో నీకు ఉపకారం చేసిందాకా నాకు తృప్తి

ఉండదు" అన్నాడు.

"సరే మీరంత తప్పదనుకుంటే ఒక ఉప కారం చేయండి. నేనో నవల రాశాను. అది ప్రింటు కూడా అయింది. దాన్ని బేన్ చేయిం చండి."

మంత్రిగారూ ఆశ్చర్యపోతూ ఉండి పోయారు.

"అదేటి, వంతులూ, నీకు మతి పోలేదుకదా? పోనీ దానికో ఎవార్డు ఇప్పించమనో, ప్రతి లైబ్రరీకి తీసుకొన్నట్లు చెయ్యమనో అడిగితే అర్థం ఉందిగానీ, నిషేధించమంటావేటీ? అన్నాడు.

"అంతే సార్! చేయగలిగితే అమాత్రం ఉపకారం చాలు" అన్నాడు.

"సర్లే నీ ఖర్మ!" అని సెక్రెటరీని పిలిచి, వివరాలు నోటు చేసుకోమన్నాడు.

వారం రోజులలో విఠలరావు రాసిన నవలని నిషేధించుతూ అర్డర్సు జారీ అయాయి. లైబ్రరీలనుంచి తొలగించ వలసిందిగా కూడా ఆదేశాలు జారీ అయాయి. (ఆ దే లైబ్రరీలోనూ లేదని ఎవరికి గుర్తు?) న్యూస్ పేపర్లోనూ వచ్చింది.

విఠల్‌రావూ, రచయిత తమ ప్రయ త్నాలు ఫలించి నందులకు, తమ కిన్నాళ్ళకి మంచి రోజులు వచ్చి నందుకూ కలలు కంటూ గాలిలో తేలిపోయారు. నవల ఇరవైకి పెంచ మన్నాడు రచయిత.

విఠలరావనె రచయిత 'వెలగని దీపాలు' అనే నవల తెలుగు సాహిత్య వినీలా కాశంలో ఏ మబ్బు వెనకుదాక్కొన్నాయో వెదకడం ఆరంభించారు పుస్తక ప్రచురణ సంస్థలు దీన్ని ఎందుకు నిషేధించారో తెలుసు కోవాలనుకునే ఉత్కంట పాఠకులలో పెరిగి పోయింది.

ఇదిలా ఉండగా -

విఠలరావు పందిరి మంచం మీద పడుకుని బంగారు, వెండి కలల్ని కంటున్నాడు. అయిదు వేల పెట్టుబడితో ముప్పయిదు వేల లాభం! రచయితకి మంచి బహుమతి ఇవ్వాలనుకున్నాడు, అలాగా ఆలోచిస్తున్న విఠలరావు కంట్లో ఏదో నలక పడింది.

"భార్యని పిలిచి కంట్లో గట్టిగా వూదమన్నాడు. విఠలరావు కళ్ళల్లో గట్టిగా వూదిన భార్య అయ్యయ్యో! మంచం నిండా ఈ చెదపురుగులు ఏమిటీ?" అంటుండగానే విఠలరావు చాతీమీద మరిన్ని పురుగులు పడుతున్నాయ్?" అని ఏదో అనుమానం వచ్చి నిచ్చెన వేసుకుని ఆటక ఎక్కాడు.

ఇంకేముంది?

పది నంవత్సరాల నుండి అతను పడుతున్న శ్రమనంతా చెదపురుగులు కొరికి పారేశాయి. కొన్ని నంవత్సరాల క్రితం అటకమీద పడేసిన అతని నవలల కట్టల్ని చెదపురుగులు ప్రతి పేజీని చదివేసి జీర్ణిం చేసుకున్నాయి. పార్శిలు విప్పకుండానే తాడు విడిపోయింది. దానిమ్మ పండు ఒలిస్తే పొర క్రింద కనిపించిన ఇన్నేసి గింజల్లా పుస్తకం తీస్తే కేజీల చొప్పున చెదపురుగులు!

"ఓ సేవ్! ఆవేళ నువు అటకమీదకి విసిరేశావ్ ఈ చెదపురుగులు నన్ను పూర్తిగా తినేశాయ్‌" గట్టిగా ఏడవాలనుకున్న విఠలరావుకు మాట రాలేదు. "విఠలా!... విఠలా.... పాండురంగ విఠలా!!" దూరం నుండి చెయ్యవలసిన పనిని ప్రబోధిస్తూంది సినీ గీతం.

(నిషేధించిన పుస్తకాలకు, సినిమాలకూ ఈ రోజులలో పెరుగుతున్న విలువను ఆధారంగా చేసుకుని హాస్యంగా వ్రాసిన కథ ఇది. కేవలం కల్పితం రచయిత)

(రచనాకాలం 1982)